క్లుప్తంగా

ప్రతీ ఒక్కరు పరిశుభ్రతను పాటించాలి



పెగడపల్లిలో నిల్వనీటిని పారబోస్తున్న సిబ్బంది

పెగడపల్లి: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు నరేశ్, రమ ప్రజలకు సూచించారు. మండలం కేంద్రంలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు ఇంటింటా పర్యటిస్తూ ట్యాంకులు వీధుల్లోని గుంతలను పరిశీలించారు. నీటి తొట్టీలు, టైర్లలో ఉన్న నీటి నిల్వలను పారబోయించారు. సీజనల్ వ్యాధుల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యుడు శంకర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఆశవర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న బీఎస్ఎస్ నాయకులు

జగిత్యాలటౌన్: వారం రోజులుగా కురిసిన వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని భారత్ సురక్షా సమితి నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శుక్రవారం జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన జిల్లా వాసులకు సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. బాధితులకు పది వేల రూపాయల తక్షణ సహాయం సహాయంతో పాటు, ఇండ్లు కూలిపోయిన వారికి 50 వేల ఆర్థిక సహాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు, అక్కినపెల్లి కాశీనాథం, చందా సుగుణాకర్, బండి సత్యనారాయణ, మాడిశెట్టి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం



అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్

రాయికల్: పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు తెలిపారు. శుక్రవారం రాయికల్ పట్టణంలోని మత్తడిని పరిశీలించి అనంతరం 5,6,7 వార్డులను పరిశీలించారు. పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని, బాధితులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, శ్రీరాముల సత్యనారాయణ, మోర రాంమూర్తి పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపాలి

కోరుట్ల: పట్టణంలోని ముంపు ప్రాంతాలకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొమిరెడ్డి కరం అన్నారు. శుక్రవారం స్థానిక ఐబీ గెస్ట్‌హౌజ్ లో మాట్లాడారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముంపు ప్రాంతల్లోని పేద ప్రజలకు పునరావాసాలు కల్పించాలన్నారు. బాత్‌రూం గోడ కూలి మృతి చెందిన బొక్కరి విజేత అనే మహిళ కుటుంబానికి రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో నాయకులు సదుల వినయ్,కటుకం చంద్రశేఖర్, గంగాదర్, చెరుకు సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల నియామకం

జగిత్యాల: జిల్లాకు ఇద్దరు స్పెషల్ డిప్యూటి కలెక్టర్లను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు.జగిత్యాలకు కె.కృష్ణవేణి, మెట్‌పల్లికి ఆర్డీవోగా మధును నియమించారు.

మెట్‌పల్లి ఆర్డీవోగా మధు

మెట్‌పల్లి: మెట్‌పల్లి ఆర్డీవోగా దూలం మధును నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కొంతకాలంగా ఖాళీగా ఉన్న మెట్‌పల్లి ఆర్డీవోగా మధును నియమించింది.

చెరువు కట్టల మరమ్మతులకు చర్యలు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత
- వర్షాలకు దెబ్బతిన్న చెరువులు, కుంటలు పరిశీలన



కండ్లపల్లిలో గండిపడ్డ కట్టను పరిశీలిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ వసంత,ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: చెరువుకట్టల మరమ్మతులకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం కండ్లపల్లి శివారులోని కుంట కట్టకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న చెరువులు, కుంటల మరమ్మతుల కోసం ప్రత్యేక నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని, త్వరలో దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారులు మరమ్మతులపై దృష్టి సారించాలి

జగిత్యాలరూరల్: అధికారులు మరమ్మతులపై దృష్టి సారించాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్, చెర్లపల్లి గ్రామాల్లో గత కొద్దిరోజులుగా కురుస్తున్న దెబ్బతిన్న చెరువులు, కుంటల కట్టలను, రోడ్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నష్టం జరిగిన రోడ్లు, చెరువు కట్టల విలువలను అంచనా వేసి వెంటనే ప్రభుత్వానికి నివేదిక పంపించాలని ఆదేశించారు. గండిపడ్డ కల్వర్టులను వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లగంగనర్సు, ఇరిగేషన్ ఈఈ అబ్దుల్‌ఖాన్, పంచాయతీరాజ్ శాఖ డెప్యూటీ ఈఈ మిలింద్, తహసీల్దార్ నవీన్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు పాల్గొన్నారు.

భారీగా పంట నష్టం



నష్టపోయిన పొలాలను పరిశీలించిన ఏవో దీపిక

మల్లాపూర్: మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు 1,852 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను స్థానిక ప్రజాప్రతినిధులు, ఏఈవోలు, రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు గత వారం రోజులుగా ఏడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాకాలకు 1,362 ఎకరాలలో వరి, 490 ఎకరాల్లో మొక్కజోన్నతో మొత్తం 1,852 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. నివేదికను జిల్లా వ్యవసాయశాఖ ఉన్నతాదికారులకు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిరిపూర్ సర్పంచ్ భూక్య గోవింద్‌నాయక్, ఎంపీటీసీ ఏనుగు రాంరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం మండలంలో..

ఇబ్రహీంపట్నం: మండలంలో కురిసిన భారీ వర్షానికి 830 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారి దీపిక తెలిపారు. శుక్రవారం మండలంలోని వర్షాలకు నష్టపోయిన వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. 700 ఎకరాల్లో వరిపంట, 130 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు తయారు చేసి నివేదికను పై అధికారులకు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రాత్రంతా బిక్కుబిక్కు..



ఎర్దండి శివాలయం మునిగి ప్రవహిస్తున్న గోదావరి

ఇబ్రహీంపట్నం: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరిలోకి గురువారం రాత్రి 32 గేట్ల ద్వారా 3 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. దీంతో గోదావరి ప్రక్కనే ఉన్న ఎర్దండి గ్రామ ప్రజలు బిక్కుబిక్కుమంటు గడిపారు. రాత్రివేళ గోదావరిలోకి ఎక్కువ నీటిని వదిలితే గ్రామ శివారులో ఉన్న ఇండ్లు నీట మునిగే పరిస్థితి నెలకొనడంతో తహసీల్దార్ రవికిరణ్‌కుమార్, ఎంపీడీవో ప్రభు, ఎస్సై ఉమసాగర్ రాత్రిపూట ఎర్దండిలోనే బస చేసి గోదావరి ఉధృతిని ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుని ఎర్దండి ప్రజలను అప్రమత్తం చేశారు. శుక్రవారం ఉదయం నుంచి గోదావరి తగ్గుముఖం పట్టడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. సాయంత్రం 5 గంటల వరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 18 గేట్ల ద్వారా 50 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదలడంతో వరద తగ్గింది.

వర్షాలతో నష్టపోయినవారిని ఆదుకుంటాం

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్ బాబు



గంభీర్‌పూర్‌లో కొచ్చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కథలాపూర్: భారీ వర్షాలతో నష్టపోయిన ప్రతీ ఒక్కరిని ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. శుక్రవారం కథలాపూర్, మేడిపెల్లి, బీమారం మండలాల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించి, వర్షాలతో నష్టపోయిన రోడ్లను, చెరువులను, పంటలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షంతో కలిగిన నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు త్వరగా సౌకర్యాలు కల్పించాలన్నారు. రెండు మండలాల్లో జరిగిన నష్టాన్ని జిల్లా మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిహారం వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. రాజలింగంపేటలో వరద ఉధృతిలో చిక్కుకున్న ముగ్గురిని కాపాడిన యువకులను ఎమ్మెల్యే రమేశ్‌బాబు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, సత్తిరెడ్డి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ శీలం మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టంపై అధికారుల పరిశీలన



పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మల్యాల:వర్షాలకు మండలంలో నీటి మునిగిన వరి పొలాలను శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. మండలంలోని తక్కళ్లపల్లి, లంబాడిపల్లి, ఒబులాపూర్, మద్దుట్ల,మానాల గ్రామాల్లో పర్యటించారు. పొలాల్లో ఇసుక మేటలు వేసినట్లు గుర్తించారు. ప్రాథమిక పంట నష్టం వివరాలను సేకరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పి.సురేశ్‌కుమార్, ఏడీఏ టెక్నికల్ కల్పన, ఏవో చంద్రదీపక్, ఏఈవోలు పాల్గొన్నారు.

పూడూర్‌లో..

కొండగట్టు: కొడిమ్యాల మండలం పూడూర్‌లో నిన్నటి వరకు కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను శుక్రవారం జిల్లా వ్యవసాయ ,అధికారి పి.సురేశ్ కుమార్ ఏడీఏ కల్పనా మండల వ్యవసాయ అధికారి పర్లపెల్లి జ్యోతి పరిశీలించారు. వరినాట్లను అలాగే ఎరువుల వాడకం తాత్కాలికంగా నిలివేయాలని లేదంటే వరినారు కొట్టుకుపోయే అవకాశాలున్నాయన్నారు. ఆరుతడి పంటలు పత్తి కంది పంటల్లో గండ్లు పెట్టి నీరు తీసివేయాలని నీరు నిలువకుండా చూసుకోవాలని రైతులకు తెలిపారు ఏఈవో శ్రీలత గ్రీష్మ పీఏసీఎస్ చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, రైతు బంధు కోఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి, రాంరెడ్డి, అజయ్‌రెడ్డి, మల్లేశం రైతులు పాల్గొన్నారు

‘ప్రజలు బాధలో ఉంటే ఎమ్మెల్యే మొద్దు నిద్రలో ఉన్నారు’



కొడిమ్యాలలో మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం

కొండగట్టు: భారీ వర్షాలకు నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న పత్తిపైర్లకు తీవ్ర నష్టం వాటిల్లిందని చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మేడిపెల్లి సత్యం అన్నారు శుక్రవారం కొడిమ్యాలలో మాట్లాడుతూ వర్షంతో కొడిమ్యాల, నాచుపెల్లి, చింతలపల్లి ,కోనాపూర్, సూరంపేట, తిర్మలాపూర్‌తో పాటు చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచాయన్నారు. వర్షంతో ఇండ్లలోకి నీరు చేరడంతో భయాందోళనకు గురైనారన్నారు. ఇంత జరిగినా.. ఎమ్మెల్యే రవిశంకర్ మాత్రం మొద్దు నిద్రలో ఉన్నాడని అన్నారు. అధికారులు,ఎమ్మెల్యే ఎలాంటి పునరావృత చర్యలు చేపట్టలేదన్నారు. కొడిమ్యాల మండల చిలుక వాగు రెండు వైపుల గ్రావిటీ వాల్ నిర్మించి బస్టాండ్ సమీపంలో బ్రిడ్జిలను పునరుద్దరించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణ గౌడ్ కేడీసీసీబీ డైరెక్టర్ గుడి మల్లిఖార్జున్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం జీవన్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేశ్వరి నాయకులు చిలువేరి రాజేందర్ ప్రసాద్ కిషన్‌రెడ్డి ముమ్మాడి స్వామి అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు రాఘవపేట, కుస్తాపూర్, సిరిపూర్, గొర్రెపల్లి, వీవీరావుపేట, రేగుంట, చిట్టాపూర్ గ్రామాల్లో శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు డాక్టర్ జేఎన్ వెంకట్, సురభి నవీన్‌కుమార్ వేర్వేరుగా పర్యటించి దెబ్బతిన్న రోడ్లు, పంటలు, గండిపడ్డ చెరువులను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, నాయకులు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, బైన ప్రశాంత్, ముత్యాల చంద్రశేఖర్, పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన పంటలు పరిశీలన

కథలాపూర్: మేడిపెల్లి, బీమారం మండలాల్లో ఇటివలే కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలను, రోడ్లను శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. భారీ వర్షాలతో రోడ్లు, కల్వర్టులు తెగిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్లను త్వరగా మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, సయ్యద్, రాజన్న, జీవన్, చాంద్, వినయ్, హరీశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

ఇబ్రహీంపట్నం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ రవికిరణ్ కుమార్‌ను రైతులు విన్నవించారు. వరి, మొక్కజొన్న, సోయా, పసుపు పంటలకు భారీ వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు, అబ్బురావు చెరువు, పాలవాగు, వెంకటాద్రి చెరువు , పెద్ద చెరువు పరిధిలోని వందాల ఎకరాల్లో పంటలకి నష్టం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో రైతులు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, బద్దం సత్యరెడ్డి, జీవన్‌రెడ్డి, రాజరెడ్డి, రమేశ్, హరిప్రసాద్, శ్రీను, గంగాధర్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి



పంటలు పరిశీలిస్తున్న జువ్వాడి సోదరులు

మల్లాపూర్: భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందజేయాలని పీసీసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు రాఘవపేట, సిరిపూర్, గొర్రెపల్లి గ్రామాల్లో పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. వరదలతో పంటనష్టపోయిన రైతులను, ఇళ్లు కూలిపోయిన బాధితులను, లోతట్టు ప్రాంతాల ప్రజలను కలిసి పరామర్శించారు. దెబ్బతిన్న రోడ్లు, గండిపడ్డ చెరువులను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకి రూ.30వేల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకేటి నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కల్వర్టులు సరిగా నిర్మిస్తే రోడ్లు కోతకు గురికావు



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

కథలాపూర్: గ్రామాల్లో వర్షపు నీళ్ల పోయే విధంగా కల్వర్టులు సరిగా నిర్మిస్తే రోడ్లు కోతకు గురి కావని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. వర్షాలకు కోతకు గురైన కథలాపూర్ మండలం సిరికొండ–తక్కళ్లపెల్లి రోడ్డు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా వర్షాకాలం ఈ రోడ్డు కోతకు గురవుతుందని, సమస్యను శాశ్వతంగా పరిష్కరించే విధంగా అధికారులు చూడాలన్నారు. వర్షాలతో నష్టపోయిన రోడ్లను, చెరువులను త్వరగా మరమ్మతులు చేయించేందుకు స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బద్రి సత్యం, గాంధారి శ్రీనివాస్, గుండేటి రాజు, అల్లె రాందాస్, మహేశ్, రాజారెడ్డి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నష్టాన్ని అంచనా వేసి నివేదిక తయారు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ భీమేశ్వరి

ఇబ్రహీంపట్నం: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గ్రామాల్లో జరిగిన నష్టాన్ని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఎంపీపీ జాజాల భీమేశ్వరి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ మండలంలోని అతర్గాత రోడ్లు, పంచాయతీ రాజ్ రోడ్లు, చెరువులు, కుంటలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, పంట పొలాలు నష్టపోయిన వాటి వివరాలను సేకరించి నష్టం అంచనా తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, తహసీల్దార్ రవికిరణ్ కుమార్, ఎంపీవో కృపాకర్, ఏవో దీపిక, పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

రాయికల్: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ సూచించారు. శుక్రవారం రాయికల్ మండలం అల్లీపూర్, అయోధ్య, ఉప్పుమడుగు గ్రామాల్లో డ్రైడే సందర్భంగా ఇంటింటికీ వెళ్తూ నిలువ ఉన్న నీటిని తొలగించారు. వర్షాలు కురియడంతో నిలువ ఉన్న నీటితో రోగాలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆయన వెంట సర్పంచులు గంగారెడ్డి, జీవన్‌రెడ్డి, కైరం ముత్తయ్య పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల పరిశీలన



పెద్దవాగును పరిశీలిస్తున్న డాక్టర్ సంజయ్

కోరుట్ల: పట్టణంలో బుధ, గురు వారాల్లో కరిసిన భారీ వర్షాలకు దెబ్బ తిన్న వరద ప్రాంతాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం పరిశీలించారు. 18 వ వార్డుతో పాటు పలు లోతట్టు ప్రాంతాలను పరిశీలించి సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నారు.అండగా ఉంటామని ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. మొహర్రం సందర్భంగా పీరీల మజిద్‌ను సందర్శించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అనిల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: కోరుట్ల మండలంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం పరిశీలించారు. సంగెంలో పెద్ద వాగు భారీ వరదతో చెక్‌డ్యామ్, వంతెన ప్రాంతంలో కోతకు గురైన ప్రాంతాన్ని డాక్టర్ సంజయ్ పరిశీలించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నాగులపేటలో ముంపునకు గురైన నాగులమ్మ ఆలయాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. పైడిమడుగు, సర్పరాజ్‌పల్లి, జోగిన్‌పల్లి గ్రామాల్లో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి నష్ట పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, జిల్లా సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచులు దమ్మ భీమారెడ్డి, చెప్యాల నర్సయ్య, కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, దుంపాల నర్సు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని కొత్తపేట శివారులో బ్రిడ్జి వద్ద నున్న రోడ్డు తెగిపోవడంతో కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తనయుడు డాక్టర్ సంజయ్ శుక్రవారం రాత్రి పరిశీలించారు. ఆర్అండ్‌బీ అధికారులతో ఫోన్లో మాట్లాడి వెంటనే పనులు చేపట్టాలని కోరారు. ఆయన వెంట కొత్తపేట నాగాలయం ఆలయ కమిటీ చైర్మన్ ప్రవీణ్, సర్పంచ్ రాజేశం, మాజీ సర్పంచ్ మీనుగ అంజయ్య ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

జీవనోపాధిని కోల్పోయాం ఆదుకోండి

మల్లాపూర్: మండల కేంద్రంలోని పెద్దచెరువుకి గండిపడి జీవనోపాధిని కోల్పోయామని, తమను ఆదుకోవాలని గంగపుత్రులు ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. శుక్రవారం గంగపుత్రులు చెరువును సందర్శించి ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని పెద్ద చెరువు, దేవునికుంటల్లో చెపలవేట వృత్తినే జీవనాధారంగా బతుకుతున్నామన్నారు. కాగ భారీ వర్షాలతో చెరువులకు గండిపడి రూ.లక్షల మత్స్య సంపద వరద నీటితో వెళ్లిపోయిందని విలపించారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం మండల సలహాదారుడు ఎల్ల చిన్నదేవయ్య, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ఎల్ల ఆశయ్య, ప్రధాన కార్యదర్శి న్యావనంది నికేశ్, సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కథలాపూర్: బీమారం మండలం వెంకట్రావుపేటలో గల్ఫ్ బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి శుక్రవారం రూ. 5 వేలు ఆర్థికసాయం అందించారు. వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పస్తం సాయిలు 15 రోజుల క్రితం గల్ఫ్‌లో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరుపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

కూలిన ఇళ్లు పరిశీలించిన ఎంపీపీ

ఇబ్రహీంపట్నం: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలిన ఇండ్లను శుక్రవారం ఎంపీపీ జాజాల భీమేశ్వరి పరిశీలించారు. శుక్రవారం మండలంలోని గోధూర్‌లో ఎండీ జమాల్‌కు చెందిన ఇళ్ల పైకప్పు కూలడంతో పరిశీలించి ఆమె మాట్లాడుతూ ఇళ్లు కూలిన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందెందుకు కృషి చేస్తానని అవసరమైన వారికి గృహలక్ష్మీ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం

మెట్‌పల్లి: పట్టణంలో వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను శుక్రవారం అధికారులు ముమ్మరం చేశారు. భారీ వర్షంతో రబ్బానీపురా, సుల్తాన్‌పురా, రాంనగర్ శివారుల్లో ఉన్న ఇండ్లను వరద నీరు చుట్టు ముట్టిన సంగతి తెలిసిందే. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లి ఇండ్ల మధ్య ఉన్న వరద నీటిని మళ్లించారు. అలాగే ఫిల్టర్‌బెడ్ పరిసరాల్లో నిలిచిన నీటిని కూడా తొలగించారు.

మోకాళ్లపై కూర్చొని జీపీ కార్మికుల నిరసన

మెట్‌పల్లి: పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం మండల పరిషత్ ఆవరణలో నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డిమాండ్ల పరిష్కారం కోసం 23 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వాసాల రాములు, గణపతి, వినోద్, గంగరాజం, సాయిలు, నర్సయ్య, మౌనిక, లక్ష్మి తదితరులున్నారు.

నాగుపాముకు వినతిపత్రం

మల్యాల: తమ డిమాండ్ల సాధన కోసం దీక్ష చేపట్టిన పారిశుధ్య కార్మికులు శుక్రవారం నాగుపాముకు వినతిపత్రం సమర్పించి, నిరసన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ఇకనైనా తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ నినాదాలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

మెట్‌పల్లి: పట్టణంలోని వెంకట్రావ్‌పేట వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంప్రసాద్(33) అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఓ డీసీఎం వ్యాన్ వెంకట్రావ్‌పేట వద్ద పెట్రోల్ బంకులో డీజిల్ నింపుకుని నిజామాబాద్ వైపు వెళ్తుండగా, ఎదురుగా రాంప్రసాద్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గాయత్రి బ్యాంక్ జగిత్యాలకే గర్వకారణం

జగిత్యాల: గాయత్రిబ్యాంక్ జగిత్యాలకే గర్వకారణమని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలోని కరీంనగర్‌రోడ్‌లో నిర్మించిన నూతన బ్రాంచ్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగిత్యాల జిల్లా కేంద్రంగా ప్రారంభమై గాయత్రిబ్యాంక్ 23 బ్రాంచ్‌లతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడంతో జగిత్యాల జిల్లాకే గర్వకారణంగా మారిందన్నారు. అన్ని వసతులతో కూడిన బ్యాంక్ ఏర్పాటు చేశారని, రూ.25 లక్షల వాటాధనంతో ప్రారంభించిన బ్యాంక్ నేడు రూ.1360 కోట్ల డిపాజిట్లతో అభివృద్ధి సాధించిందన్నారు. అనంతరం బ్యాంక్ సిబ్బందిని అభినందించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ గాయత్రి బ్యాంక్ మొదటి నుంచి వినియోగదారుల కోణంలో ఆలోచిస్తూ వారి అవసరాలకు అనుగుణంగా సేవలందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, జిల్లా సహకార అధికారి రామానుజాచారి, బ్యాంక్ అధ్యక్షుడు ముత్యాల లక్ష్మణ్‌రెడ్డి, బ్యాంక్ సీఈవో వనమాల శ్రీనివాస్ పాల్గొన్నారు.